


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రూ.18.50 కోట్లతో పట్నం చెరువు సుందరీకరణ

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రూ.18.50 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో చేపట్టనున్న ఇబ్రహీంపట్నం పెద్దచెరువు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన హెచ్‌ఎండీఏ, నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, హెచ్‌ఆర్‌డీసీఎల్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి చెరువును సందర్శించారు. చెరువు సుందరీకరణతో పాటు పార్కును అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. మొత్తంగా నాలుగు స్పాట్లను గుర్తించినట్లు ఆయన చెప్పారు. చెరువు పెద్ద తూము, చిన్న తూము, చిన్న చెరువు రక్త మైసమ్మ దగ్గర కట్ట వెడల్పు చేయనున్నట్లు తెలిపారు. ఉప్పరిగూడ క్రాసింగ్ కొనకట్ట వద్ద పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే ఇక్కడ ఉప్పరిగూడ క్రాసింగ్ ప్రమాదకరంగా ఉన్నందున ఫ్లైఓవర్ నిర్మించడమా, లేదంటే అండర్‌పాస్ నిర్మించాలా అనేది సాంకేతికంగా పరిశీలన చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఇక్కడ ఉప్పరిగూడ వైపు చెరువు అలుగు ఉండగా ఇదే క్రాసింగ్‌లో హైటెన్షన్ టవర్ లైన్లు ఉన్నందున పకడ్బందీ ప్లాన్ చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రవిశంకర్, ఈఈ రమేష్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, హెచ్‌ఎండీఏ ఈఈ రజిత, హెచ్‌ఆర్‌డీసీఎల్ ఈఈ మహబూబ్‌మియా, పంచాయతీ రాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దారు సునీతారెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి, కె.గురునాథ్‌రెడ్డి, పాండురంగారెడ్డి ఉన్నారు.



పురానికి వరం

ఇన్నాళ్లు నిధులు లేక మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తాజాగా అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వీటితో సీసీ రోడ్డు, తాగునీటి సౌకర్యాలతో పాటు డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే నగర శివార్లలోని మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 13 పురపాలికల అభివృద్ధికి మొత్తం రూ.239.40 కోట్లు మంజూరు కాగా, ఇందులో సుమారు రూ.42 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మంజూరు చేసింది. మిగతా నిధుల మొత్తాన్ని నేషనల్ హౌజింగ్ బ్యాంకు సహకారంతో కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది.

ఎట్టకేలకు పురపాలికలకు నిధులు

మున్సిపాలిటీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు, కేటాయించిన నిధులు ఇలా..

మున్సిపాలిటీ/ కార్పొరేషన్	చేపట్టనున్న పనులు	నిధులు (రూ.కోట్లలో)
షాద్‌నగర్	3	18.70
తాండూరు	4	18.70
వికారాబాద్	4	18.70
అలియాబాద్	9	15.00
బడంగ్‌పేట	2	18.70
దమ్మాయిగూడ	32	18.70
దుండిగల్	13	18.70
జల్‌పల్లి	2	18.70
జవహర్‌నగర్	2	18.70
మీర్‌పేట	2	18.70
నాగారం	4	18.70
నిజాంపేట	2	18.70
ఫిర్జాదీగూడ	8	18.70

- పలు అభివృద్ధి పనులకు రూ.239.40 కోట్లు
- ఉమ్మడి జిల్లాలో 13 బల్దియాల్లో 83 పనులు
- విలీన గ్రామాల ప్రజలకు కొంత ఊరట
- శివార్లలో కొలువుదీరిన పెను సమస్యలు
- పరిష్కారానికి మరిన్ని నిధులు అవసరం


షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): నిధుల లేమితో సతమతమవుతున్న పురపాలికలపై రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపింది. ఉమ్మడి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అత్యవసరంగా 83 అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.239.40 కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పరిపాలన పరమైన ఆమోదం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయి. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూడీఎఫ్) కింద కేంద్రం నిధులు అందిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మిగతా మొత్తాన్ని అందిస్తోంది. ఈ నిధులతో సీసీ రోడ్లు, తాగునీటి సౌకర్యాలతో పాటు డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. నగర శివార్లలోని మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో కొంత కాలంగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదనే విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. కొన్నాళ్లుగా నిధుల కేటాయింపు లేకపోవడంతో విలీన ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలికల్లో తమను కలిపిన తరువాత అభివృద్ధి పనులు జరగడం లేదని వాపోతున్నారు. రోడ్లు, తాగునీరు తదితర

మిగతా 7వ పేజీలో...


పోస్టర్‌ను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

జిల్లాలో ఐక్యతా పాదయాత్రలు

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి నేపథ్యంలో జిల్లాలో ఐక్యతా పాదయాత్రలు చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన అధికారి ఐసయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో మేరా యువ భారత్, జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్), ఎన్‌సీసీ శాఖల ద్వారా ఈ జయంతి వేడుకలకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో యువతను భాగస్వామ్యం చేస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని ప్రణాళిక రూపొందించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా దేశ స్వాతంత్ర్యం, పునర్నిర్మాణంలో భాగస్వాములైన త్యాగధనులను స్మరించుకుంటూ యువతలో ఐక్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా ఉండాలన్నారు. కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రి నేతృత్వంలో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 31 నుంచి నవంబరు 25 వరకు 8 నుంచి 10 కిలోమీటర్ల మేర ఐక్యతా పాదయాత్రలు నిర్వహించే ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లాలో రెండు విడతలుగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో వెంకటేశం, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు ఉన్నారు.


మోకిల పల్లె ప్రకృతివనంలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న లింగ్డో

ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దు

భారత ఎన్నికల మాజీ ప్రధానాధికారి జేఎం.లింగ్డో

శంకర్‌పల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జన బాహుళ్యం నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని భారత ఎన్నికల మాజీ ప్రధానాధికారి జేఎం. లింగ్డో పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల, పిల్లిగుండ్ల గ్రామాలలోని నర్సరీ, క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతి వనం, సేంద్రీయ ఎరువుల కేంద్రాన్ని సోమవారం ఎంపీడీవో వెంకయ్య గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్లాస్టిక్ భూతంతో చాలా అనర్థాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో పెనుమార్పులు సంభవించడంతో పాటు, భూమి సారం కోల్పోతుందని వివరించారు. ప్రజలు ప్లాస్టిక్‌ను వాడకుండా పర్యావరణ హితానికి పాటుపడాలన్నారు. అలాగే ప్రతీఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ మొక్కలు నాటి పరిరక్షించాలని సూచించారు. మోకిలలో తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువు తయారుచేసే విధానంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మోకిలలోని పల్లెప్రకృతి వనంలో మొక్కలు నాటిన అనంతరం పిల్లిగుండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, పంచాయతీ కార్యదర్శులు ఎల్లయ్య, ప్రమీల, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లక్కు చిక్కింది.. షాపు దక్కింది!


సరూర్‌నగర్ జోన్ 2లో డ్రా తీస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి




శంషాబాద్ జోన్ దుకాణాలకు డ్రా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, హాజరైన దరఖాస్తుదారులు

ముగిసిన మద్యం దుకాణాల లాటరీ

- సరూర్‌నగర్, శంషాబాద్ పరిధిలోని షాపులకు డ్రా తీసిన కలెక్టర్, అదనపు కలెక్టర్
- 246 దుకాణాలకు 16381 అప్లికేషన్లు
- భారీగా తరలివచ్చిన దరఖాస్తుదారులు
- షాపు దక్కిన ఆనందంలో కొందరు.. నిరాశతో వెనుదిరిగిన మరికొందరు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసింది. సోమవారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని మల్లికా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ, స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. శంషాబాద్ జోన్ 1, సరూర్‌నగర్ జోన్ 2 గా విభజించి లక్కీ డ్రా తీశారు. రెండు జోన్లలో 246 మద్యం దుకాణాలు ఉండగా, 16381 దరఖాస్తులు వచ్చాయి. ఉదయం 11గంటలకు సరూర్‌నగర్ జోన్‌కు సంబంధించిన మద్యం దుకాణాలకు కలెక్టర్ నారాయణరెడ్డి, శంషాబాద్ జోన్ పరిధి వాటికి అదనపు కలెక్టర్ శ్రీనివాస్ డ్రా తీశారు. సరూర్‌నగర్ జోన్‌లో 138 మద్యం దుకాణాలు ఉండగా, 7845 అప్లికేషన్లు వచ్చాయి. మొత్తం దుకాణాలకు డ్రా తీశారు. సరూర్‌నగర్ జోన్‌లో మొదటి డ్రా సరూర్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు, రెండవది అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్‌రెడ్డికి దక్కింది. సరూర్‌నగర్ పరిధిలో 37మంది మహిళలకు దుకాణాలు దక్కడం విశేషం. శంషాబాద్ జోన్‌లో 111 మద్యం దుకాణాలకు గాను 8536 దరఖాస్తులు వచ్చాయి, అందులో 108 దుకాణాలకు మాత్రమే లక్కీడ్రా తీశారు. మరో మూడు దుకాణాలకు

మిగతా 8వ పేజీలో...



1న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ
7

మొక్కే కదా అని వదిలేస్తే..
ప్రభుత్వ భవనాలకు పొంచి ఉన్న ముప్పు.. గోడలకు పగుళ్లు.. దెబ్బతింటున్న నిర్మాణాలు
8

హైటెన్షన్ టవర్ల నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు


రైతులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కడ్తాల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిచెడ్ గ్రామంలో 765 హైటెన్షన్ విద్యుత్‌లైన్ టవర్ల నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తమ పొలాల మీదుగా టవర్ల నిర్మాణం చేపట్టొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ గ్రిడ్ సంస్థ బీదర్ నుంచి మహేశ్వరం వరకు 765 హైటెన్షన్ లైన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అలైన్‌మెంట్‌ను మార్చాలని కొన్ని నెలలుగా భూ నిర్వాసితులు పోరాటాలు కొనసాగిస్తున్నారు. ఉన్నత స్థాయి ప్రజాప్రతినిదులు, కలెక్టర్, పవర్‌గ్రిడ్ అధికారులను కలిసి తమ ఆవేదనను వెల్లబోసుకున్నారు. కొంత కాలంగా టవర్ల నిర్మాణం పనులను పవర్ గ్రిడ్ సంస్థ అధికారులు నిలిపివేశారు. కాగా సోమవారం కడ్తాల మండలం రావిచెడ్ గ్రామానికి చెందిన రైతు రవీందర్ వ్యవసాయ పొలంలో హైటెన్షన్ లైన్ నిర్మాణానికి డీజీఎం సంతోష్ ఆధ్వర్యంలో పవర్ గ్రిడ్ అధికారులు పోలీసులతో పొలం వద్దకు చేరుకున్నారు. పనులకు ప్రారంభిస్తుండగా రైతులు అభ్యంతరం తెలిపారు. విషయం తెలుసుకున్న కడ్తాల భూ నిర్వాసితుల పోరాట కమిటీ నాయకులు అక్కడికి చేరుకుని టవర్ల నిర్మాణం చేపట్టవద్దని అడ్డుకున్నారు. ఏమైనా అభ్యంతరం ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని సీఐ గంగాధర్, ఎస్ఐ వరప్రసాద్ రైతులకు సూచించారు. అయినప్పటికి వారు శాంతించకపోవడంతో పలువురు రైతులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా విష్ణుప్రియ

అవార్డు అందజేసిన రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ నవీన్‌నికోలస్


అవార్డు అందుకుంటున్న విష్ణుప్రియ

కందుకూరు,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని నేదునూరు ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డును సోమవారం రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ నవీన్‌నికోలస్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. పాఠశాల అభివృద్ధికి విష్ణుప్రియ చేసిన సేవలకు ఆమెను జిల్లాస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. నగరంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవం అనంతరం మాట్లాడారు. నేదునూరు ఆదర్శ పాఠశాలలో కూరగాయలు, పండ్లతోటల పెంపకం, ఉత్తీర్ణతస్థాయి పెంచడం, సాంస్కృతిక, సంక్షేమ, క్రీడా తదితర కార్యక్రమాలను చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి, ఉపాధ్యాయులు పరమేష్, గురురాజారెడ్డి పుష్పలత, కుముద్దిని, వెంకటరమణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేటీఆర్

కేసీఆర్ మరోసారి సీఎంగా రావాల్సిన అవసరముంది

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శంషాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు కేసీఆర్ సీఎంగా మరోసారి రావాల్సిన అవసరం ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం సాయంత్రం బీఆర్‌ఎస్ మైనార్టీ నేతలతో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పెద్దపెద్ద లీడర్లను తీసుకువచ్చి తెలంగాణలో మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించి మార్పు తెస్తామంటూ ప్రచారం చేసిందన్నారు. రెండేళ్ల క్రితం మైనార్టీల కోసం రూ.4వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. మైనార్టీ సబ్‌ప్లాన్ విషయంలోనూ అదే తీరుగా ఉందన్నారు. కేసీఆర్ షాదీముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షరూపాయలు ఇస్తే.. కాంగ్రెస్ పార్టీ లక్షరూపాలతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంకు మాదిరిగా చూస్తుందే తప్పా వారికోసం చేసిందేమీ లేదన్నారు. కేసీఆర్ ప్రారంభించిన మైనార్టీ స్కూళ్లలో చదివిన ఎంతోమంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు అవుతున్నారన్నారు. తెలంగాణలో 45 లక్షల మంది మైనార్టీలున్నారని.. కేసీఆర్ హయాంలో వారిలో ఒక్కొక్కరిపై రూ. 5 వేలు ఖర్చు చేశారన్నారు. ఇది అన్ని రాష్ట్రాల కంటే చాలా ఎక్కువ అన్నారు. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో ఎంఐఎం నేత అసదుద్దీన్ కూడ చెప్పారన్నారు. కానీ ఇక్కడ తెలంగాణలో

మిగతా 8వ పేజీలో...

కొత్తూర్‌లో వైభవంగా ఛట్ పూజ

కొత్తూర్ మున్సిపాలిటీలో ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఛట్ పూజను సోమవారం రాత్రి వైభవంగా జరుపుకున్నారు. పెంజర్ల రోడ్డులోని బందోని మైసమ్మ దేవాలయ ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ నీటి సంప్‌లో ఛట్ పూజను ఉత్తర భారతీయులు ఘనంగా జరుపుకున్నారు. సూర్యుడు అస్తమించిన తర్వాత పూజా సామగ్రితో భారీగా మహిళలు తరలివచ్చి నీటిలో దిగి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలను సమర్పించారు. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో కుటుంబాలు బాగుండాలని మహిళలు సూర్య భగవానున్ని కోరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున సూర్యుడు ఉదయించకముందే తిరిగి మరోసారి ఛట్ పూజను నిర్వహిస్తారు.

కొత్తూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి)



రైతుల ఆదాయం పెరిగేలా పథకాలు

● వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెరిగేలా ప్రతీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్‌పామ్‌సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉద్యాన పంటల సాగు లక్ష్యాలను సాధించి రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ తోటల పెంపక విస్తీర్ణం పెంచడానికి అధికారుల సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో 2,500ఎకరాల్లో పంటల సాగు లక్ష్యమని తెలిపారు. రైతులకు సబ్సిడీలు, అంతర పంటల ఆదాయం, డ్రిప్ రాయితీలు తదితర వివరాలను తెలపాలని అధికారులకు సూచించారు. ఇందులో లక్ష్యం సాధించి విజయవంతంగా నిలిచిన రైతులకు రోల్‌మోడల్‌గా చూపించి బ్యాంకులు, ఉపాధిహామీ పథకం ద్వారా సహకారం అందించాలన్నారు. తెలంగాణ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులకై రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులపై ప్రభుత్వం రాయితీలు అందిస్తుందని వివరించారు. దీంతో రైతులు సాగు ఖర్చు తగ్గించుకుని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందన్నారు. ప్రతినెలా ఒకరోజు రైతు వేదికలో మండలస్థాయి అధికారులు సంబంధిత శాఖలతో రైతుల సమావేశాలు నిర్వహించి, పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఉద్యానవన శాఖ అధికారి ఆయిల్ ఫాం పంటల సాగుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, వ్యవసాయాధికారి రాజరత్నం, కో-ఆపరేటివ్ అధికారి నాగార్జున, చైర్మన్లు, ఉద్యానవన, వ్యవసాయశాఖ, మండలస్థాయి అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్


షాబాద్‌లో తహసీల్దార్ కార్యాలయంలో అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

అధికారులు సమయపాలన పాటించాలి

● ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. షాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం 2 గంటలైనా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు కార్యాలయానికి రాలేదు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి నెల రోజులుగా సంతకాలు లేవని ఎమ్మెల్యే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమయ పాలన పాటించాలని, లేని ఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ఉన్నారు. అనంతరం షాబాద్ మండలకేంద్రంలో షాబాద్ గ్రామానికి చెందిన యూనూస్, మోయిజ్ రెహమత్ ఏర్పాటు చేసుకున్న హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు తమ్మలి రవీందర్, గుండాల అశోక్, మాజీ సర్పంచులు మల్లారెడ్డి, ఆగమయ్య, నాయకులు దండు రాహుల్ గుప్తా, ఖుద్దూస్, షబ్బీర్‌అహ్మద్, శేఖర్, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి పీఠాధిపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చేవెళ్ల: శృంగేరి పీఠాధిపతి విధిశేఖర భారతి స్వామి ఆశీర్వాదంతో ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తాని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని శృంగేరి పీఠాధిపతి భారతి స్వామిజీని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక మార్గదర్శకులు సమాజంలో నైతిక విలువలను సత్యం, ధర్మం, సేవా భావాన్ని నెలకొల్పడంలో కీలక ప్రాత పోషిస్తారని చెప్పారు. శృంగేరి పీఠం మన దేశ సంస్కృతి, సనాతన సంప్రదాయాల పరిరక్షణలో అమూల్యమైన సేవలు అందిస్తోందన్నారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు


ధర్నాలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

వికారాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తవుతున్నా మూడు సంవత్సరాలుగా సుమారు రూ.8,500కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతుందన్నారు. ఫలితంగా ప్రైవేట్ కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు కూడా సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని తెలిపారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వ బిక్షకాదని, అది విద్యార్థుల హక్కు అని అన్నారు. తక్షణమే బకాయిలను విడుదల చేయకపోతే ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతుదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ నరేష్, జాయింట్ సెక్రటరీ శివసాయి, శరత్, శివ, మంజునాథ్, మధు, నందు, జాశ్వంత్, మనిష్, లోకేష్, ఆదిత్య, ముజామిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెన్షన్ వెంటనే చెల్లించాలి



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌జీపీఏటీ సభ్యులు

మన్సూరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఏడాది గడిచినా రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్ డబ్బులను అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్(ఎస్‌జీపీఏటీ) సభ్యులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీపీఏటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సలహాదారు మల్లయ్య మాట్లాడుతూ మార్చి 2024 నుంచి నేటి వరకు సుమారు తొమ్మిది వేల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్డ్ అయ్యారని, ఒక్కో పెన్షనర్‌కి రూ.40లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఉన్న బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కొంతమంది పెన్షనర్లు బకాయిలు అందక అప్పుల బాధలతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీంతో వారి కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం ఈహెచ్‌ఎస్‌కు సంబంధించి జీఓ విడుదల చేసినా విధివిధానాలు రూపొందించలేదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఐదు కరువు భత్యం బకాయిలు లేవని, వెంటనే ఈ భత్యాలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీజీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, కోశాధికారి తుమ్మల రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అనంతరెడ్డి, సత్యనారాయణరెడ్డి, డేవిడ్ ఉన్నారు.

పేదల భూములు లాక్కుంటారా?

- కలెక్టరేట్ ఎదుట భూబాధితుల ఆందోళన

మేడ్చల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శామీర్‌పేట లియోనియో భూ బాధితులు సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులకు సీపీఐ నాయకులు మద్దతుగా నిలిచి మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రంజిత్‌రెడ్డి పేదల భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు, ఎంపీ ఈటలకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు(ఇన్‌సెట్‌లో)

సమాజహితానికి కృషి చేయాలి


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న కిషన్‌కుమార్‌రెడ్డి,నర్సింహారెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాలుగు సంవత్సరాల పాటు పొందిన జ్ఞానాన్ని సమాజహితం కోసం ఉపయోగపడేలా కృషిచేయాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని చౌదరిగూడలో గల నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆయా విభాగాల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కన్న కలలను సాకారంచేసే సమయం ఆసన్నమైందన్నారు. ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. గత సంవత్సరం దేశం నుంచి అమెరికాకు 3.6లక్షల మంది వెళ్లారని అందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే 2లక్షల మంది వరకు ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నల్ల నర్సింహారెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఆయా విభాగాల డీన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెరుగైన పాలనే ధ్యేయం

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన పాలనే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో సోమవారం పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో రోడ్లను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. పేదలందరికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రగతిని జీర్ణించుకోలేని స్వార్థశక్తులు ప్రతిది రాజకీయం చేస్తూ ప్రగతి నిరోధకంగా మారాయని కసిరెడ్డి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, యాదిరిరెడ్డి, బాబా, విజయ్‌రాథోడ్, తదితరులు ఉన్నారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉమ్రా యాత్రికులు

స్వదేశానికి ఉమ్రా యాత్రికులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆల్ మీజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో 15 రోజుల క్రితం ఉమ్రా యాత్రకు బయలుదేరిన యాత్రికులు సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో యాత్రికుల కుటుంబ సభ్యులు వారికి స్వాగతం పలికారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యాత్రికులు ఈ బృందంలో ఉన్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ హాఫీజ్ మొహ్మద్ ఫయాజ్ అలీ తెలిపారు. నవంబరు 9, డిసెంబరు 21, జనవరి 12వ తేదీల్లో మరి కొంత మంది యాత్రికులు ఉమ్రా యాత్రకు బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు.

మామిడిశెట్టి సురేశ్‌కు డాక్టరేట్


సురేశ్‌ను అభినందిస్తున్న శ్రీనివాస్‌రావు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా, పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సీఎస్ఈ అధ్యాపకుడు మామిడిశెట్టి సురేశ్‌కు అనురాగ్ యూనివర్సిటీ డాక్టరేట్ లభించింది. సురేష్ అనురాగ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగు కోర్సులో 'మల్టీమోడల్ డిప్రెషన్ డిటెక్షన్ ఫ్రేంవర్క్ యూసింగ్ ఆడియో, విజువల్ అండ్ టెక్నికల్ క్యూస్' అనే అంశంపై డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. దీంతో సురేష్‌కు అనురాగ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ మహిపతి శ్రీనివాస్‌రావులు డాక్టరేట్ అందజేశారు.

చిట్టీల బాధితులకు కోర్టు నోటీసులు

తాండూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో చిట్టీల పేరిట మోసానికి పాల్పడి ఉడాయించిన మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు సంపత్‌కుమార్‌రాతి ఎట్టకేలకు కోర్టు నుంచి తాండూరులోని 26మందికి నోటీసులు పంపించారు. తనవద్ద ప్రస్తుతం డబ్బులు లేవని తనను ఎవరూఇబ్బందులు పెట్టకుండా చూడాలని కోర్టును ఆశ్రయించగా రాజేంద్రనగర్ కోర్టు ఐపి పిటిషన్‌ను వేశారు. సంపత్ రాతితో పాటు ఆయన కుమారులు గోపాల్‌రాతి, సచిన్ రాతిలు క్లయింట్‌ల వద్దకు ఎవరూ రాకూడదని సంబంధిత న్యాయవాది నోటీసులు పంపారు. నోటీసులు అందుకున్న 26మంది వచ్చేనెల 17వ తేదీన కోర్టుకు హాజరుకావాలని అట్టి నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు సంపత్ కుమార్‌రాతి తనవద్ద చిట్టీలు వేసిన వారిసంఖ్య తక్కువగా ఉండగా తానే బడాఫైనాన్స్‌లు అయిన ఆదిత్య, బిర్లా, పేటీఎం వంటి వద్ద చిట్టీ డబ్బులు డ్రా చేసుకోవడంతో పాటు బడా వ్యాపారుల నుంచిపెద్ద ఎత్తున వడ్డీకి డబ్బులు కూడా తీసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బాధితులకు నోటీసులు రావడంతో ఒక్కసారిగా ఆందోళన చెందుతున్నారు.తమ వద్దనే డబ్బులు తీసుకొని తమకే నోటీసులు పంపించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తాండూరులో ఎంతో నమ్మకంగా వ్యాపారం చేస్తూ అందరినీ నమ్మించి మోసం చేయడంపై పెదవి విరుస్తున్నారు. డబ్బులు వడ్డీకి తీసుకొనిఅట్టి డబ్బులను జల్సాలకు ఖర్చుపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

దుద్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎంపీడీవో మహేశ్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం 37 మంది లబ్ధిదారులకు చెక్కులుపంపిణీ చేశారు. మెరుగు వెంకటయ్య, శ్రీశైలంగౌడ్, ఖాజమీయ, సత్యనారాయణ, నర్సిములు, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందించిన అధికారులు, నాయకులు



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలి

» మాజీ ప్రజాప్రతినిధుల వినతి

మేడ్చల్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారని సోమవారం జిల్లాలోని మాజీ ప్రజాప్రతినిధులు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వెంటనే వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించాలని వారు కోరారు. జిల్లాలోని మున్సిపాల్టీలను జీహెచ్‌ఎంసీలో కలుపుతారానే ప్రచారం జరుగుతుందని అదే జరిగితే మరో ఆరు నెలల వరకు ఎన్నికలు జరిగే అవకాశం లేనందున ప్రజలు మరిన్ని ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందని వారు అధికారులకు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణి దేవేందర్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్, దుండిగల్ మాజీ సర్పంచ్ గణేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, శామీర్‌పేట మాజీ జెడ్పీటీసీ అనితాలాలయ్య, మేడ్చల్ మున్సిపల్ 3వ వార్డు మాజీ కౌన్సిలర్ జకట దేవరాజ్, మాజీ వార్డు సభ్యులు లింగాపూర్ మహేశ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 138 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 138 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి , డీఆర్‌వో హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతిలు ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా వారు అధికారులను ఆదేశించారు.

బషీరాబాద్ ఎంపీవోగా జయకర్



బషీరాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఎంపీవోగా జయకర్‌ను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బషీరాబాద్ గ్రామ పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు ఎఫ్ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జీ) ఎంపీవోగా బాధ్యతలను అప్పగించారు. ఇదివరకు ఇక్కడ ఎంపీవోగా పనిచేసిన విజయ్‌కుమార్ డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి ఎంపీడీవో తిరుమల స్వామి దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా, ఇటీవల ఎంపీవో విజయ్‌కుమార్‌కు ఇంచార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఎంపీడీవో, ఎంపీవో రెండు కీలక పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఇక్కడా సూపరింటెండెంట్ విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్, జూనియర్ అసిస్టెంట్ చెన్నయ్య మాత్రమే విధుల్లో కొనసాగుతున్నారు.

జీవాలపై కుక్కలదాడి

» 55 మేకలు, గొర్రెపిల్లల మృతి



పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో కుక్కల దాడిలో మృతి చెందిన మేక, గొర్రెలు

పెద్దేముల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేక, గొర్రెపిల్లలపై కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో 55మేక, గొర్రెపిల్లలు మృతి చెందాయి. ఈసంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కందనెల్లి గ్రామానికి చెందిన ఒగ్గుసాతప్ప కుటుంబం మేకలు, గొర్రెల పెంపకం ద్వారా జీవనోపాధిని పొందుతున్నారు. ఆయన వద్ద ఉన్న పెద్ద మేకలు, గొర్రెలను మేతకు తీసుకుపోయే సమయంలో వాటి చిన్న చిన్న పిల్లలను రేకులతో ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచుతారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం మేకలను మేతకు తీసుకుపోతూ చిన్న పిల్లలను రేకులషెడ్డులో వేసి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి మొత్తం 55 మేక, గొర్రెపిల్లలు మృతి చెంది ఉన్నాయి. అది చూసి ఆకుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. కుక్కల దాడిలో చనిపోయిన మేక, గొర్రెపిల్లల విలువ సుమారు 2.50 లక్షల వరకు ఉంటుందని అంచనావేశారు.

గుండ్లపోచంపల్లి ఆర్‌వోపై ఫిర్యాదు

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్‌వోగా పని చేస్తున్న అధికారి లంచాలు తీసుకుని విధులు నిర్వహిస్తున్నాడంటూ స్థానికులు ప్రజావాణిలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఇంటి నంబరు కేటాయించటానికి, ఇంటి యజమాని పేరు మార్పిడితో పాటు మున్సిపల్ కార్యాలయానికి పని నిమిత్తం వచ్చే వారి వద్ద నుంచి వసూళ్లకు అలవాటు పడ్డాడని స్థానికులు ఆరోపించారు. దీర్ఘకాలంగా ఇక్కడ పని చేస్తున్నందున ఆర్‌వో ఆగడాలు మితిమీరి పోయాయని స్థానికులు ఆరోపించారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ గ్రామ చెరువులో మురికి కాలువలు కలపటంతో చెరువునీరు మురికి మయంగా మారి స్థానికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

మంబాపూర్‌లో పెరటికోళ్ల పంపిణీ

పెద్దేముల్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధి పొందడానికి పెరటికోళ్ల పంపిణీ ప్రారంభించినట్లు సెర్ప్ ఏపీఎం శివయ్య తెలిపారు. మండలంలోని మంబాపూర్ గ్రామంలో సోమవారం తొమ్మిది మంది డ్వాక్రా మహిళలకు 180 కోడిపిల్లలను అందజేశారు. మండలంలో మొదటి విడతగా మొత్తం 20 గ్రామసంఘాల్లో 120మంది మహిళలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ గొడుగు మంజుల, అంజన్‌కుమార్, ఇస్మాయిలప్ప తదితరులు పాల్గొన్నారు.

పత్తిని విక్రయించేందుకే కపాస్ యాప్

బషీరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటను రైతులు సులభంగా విక్రయించేందుకు ప్రభుత్వం సరికొత్త యాప్‌ను తీసుకొచ్చిందని బషీరాబాద్ వ్యవసాయాధికారి అనిత తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు నేరుగా స్లాట్ బుక్ చేసకుని పంటను విక్రయించవచ్చన్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాడానికి ఆధార్ కార్డుతో మొబైల్ నెంబర్ అనుసంధానం చేసుకోవాలన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి ఉత్తర్వులు

పూడూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకంచర్ల యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకం కోసం ఉత్తర్వులు జారీ అయ్యాయని ఈవో టి.నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయశాఖ ఉప కమిషనర్ నోటిఫికేషన్ జారీచేశారు. ఇట్టి ఉత్తర్వుల మేరకు ఆసక్తిగల వారు నోటీసు ఇచ్చిన నాటి నుంచి 20రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈవో పేర్కొన్నారు.

పురానికి వరం

(ఐదో పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల కొరత ఉండడంతో కొంతకాలంగా ఈ ప్రాంతాల్లో జనం అవస్థలు పడుతున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలను ఎన్నిసార్లు విన్నివించుకున్నా ఫలితం లభించడం లేదు. అభివృద్ధి పనులు చేపట్టేందుకు తయారు చేసిన ప్రతిపాదనలు కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. దీంతో వీరంతా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. దీంతో ప్రభుత్వం అత్యవసర పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 42 కోట్లు

ఉమ్మడిజిల్లాలోని 13 పురపాలికలకు రూ.239.40 కోట్లు మంజూరు చేయగా, ఇందులో దాదాపు రూ.42 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మంజూరు చేసింది. మిగతా నిధుల మొత్తాన్ని కేంద్రం నేషనల్ హౌజింగ్ బ్యాంకు సహకారంతో అందచేస్తోంది. ప్రభుత్వం ఇలా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడంతో శివారు పురపాలికల్లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కొన్ని పనులకు మోక్షం కలగనుంది. ఇదిలా ఉంటే మరికొన్ని పురపాలికలకు కూడా నిధులు త్వరలో మంజూరయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదిలాఉంటే కొత్తగా ఏర్ప



డిన అలియాబాద్ మున్సిపాలిటీకి మినహా మిగతా అన్ని పురపాలికలకు సమానంగా నిధులు కేటాయించారు. అలియాబాద్‌లో 9 పనులకు రూ. 15 కోట్లు మంజూరు చేశారు. ఇక్కడ అత్యధికంగా రోడ్లకు రూ. 5కోట్లు కేటాయించారు.

మరిన్ని నిధులు అవసరం

పురపాలికల్లో వివిధ అత్యవసర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం భారీగానే నిధులు విడుదల చేసింది. కానీ మరిన్ని నిధులు అవసరం ఉంది. ప్రస్తుతం విడుదల చేసిన నిధులు కొన్ని పురపాలికల్లో పెండింగ్ పనులు చేపట్టేందుకు ఏ మూలకు సరిపోవు. దాదాపు అన్ని పురపాలికల్లో సమస్యలు పీడిస్తున్నాయి. వీటిని పరిష్కరించేందుకు నిధులు అవసరంపై గతంలో అధికారులు పంపిన ప్రతిపాదనలు చాలా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కొన్నింటికి ఇప్పుడు నిధులు విడుదల చేసినా ఇంకా మరిన్ని అవసరం ఉంది.

వచ్చేనెల 1న దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన

» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

శంషాబాద్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : నవంబర్ 1వ తేదీన దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిపై కేసు నమోదు చేయించడమే ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సమ్మెలో దళితుల ఆత్మగౌరవాన్ని చాటడం, న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉండే బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ప్రదర్శన మొదలై సెక్రటేరియట్‌లోని మహాత్మాగాంధీ పెద్ద విగ్రహం వరకు జరుగుతుందన్నారు. అక్కడ దళితుల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కుల మత, రాజకీయాలకతీతంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళితుల గౌరవాన్ని నిలబెట్టాలనుకునే వారందరూ ప్రదర్శనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సుప్రీం కోర్టు జడ్జిపై దాడి జరిగి 20 రోజులు గడిచిపోతున్నా నిందితుడిని అరెస్టు చేయడకపోవడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, పోలీసు డిపార్టుమెంటు జవాబు చెప్పాలన్నారు. దాడిచేసిన వ్యక్తి వెనుక ఏ శక్తులు ఉన్నాయో బయటకి రావాలన్నారు. దేశంలో దళిత వర్గాల నుంచి ఏ స్థాయికి ఎదిగినా దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్.ఉపేందర్, ఆర్. బాబుమాదిగ, పి.నర్సింహ్మా, కె.రమేష్, పి.కృష్ణమాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.శంకర్‌రావు, రత్నం, బి. రవి, ఎ.కృష్ణ, రాంచందర్, నవీన్, గణేష్, సీహెచ్. భాస్కర్, ఆనందర్, బి.పాండు, సురేష్, ప్రవీన్, రాజు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు ఆస్పత్రిలో బాలింత మృతి

వైద్యులే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



రజిత మృతదేహం

తాండూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పడంటి బిడ్డకు జన్మనిచ్చిన ఓ మాతృమూర్తి కాసేపటికే మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన గర్భిణి రజిత(28) ఈ నెల 25 వ తేదీన పురిటి నొప్పులతో తాండూరు పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో చేరింది. ఆదివారం ఉదయం పాపకు జన్మనిచ్చిన రజితకు కొన్ని గంటల తర్వాత ముక్కు నుంచి రక్తం రావడంతో కుటుంబ సభ్యులు వైద్యులకు తెలియజేశారు. అయినా సకాలంలో వైద్యులు పట్టించుకో లేదని.. ఆ తర్వాత ఇబ్బందిగా ఉందని హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అప్పటికే పరిస్థితి విషమంగా మారడంతో ఆమె మృతి చెందింది. దీంతో ఆస్పత్రి ఎదుట బాధితులు ఆందోళనకు దిగారు. రజిత భర్త ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి చెప్పారు.

సమగ్ర విచారణ జరుపాలి: ప్రజా సంఘాలు

ముఖ్యమంత్రి సొంత జిల్లాలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల బాలింత మృతి చెందిందని, దీనిపై సమగ్ర విచారణ జరుపాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్ కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా మాతా శిశు ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు సొంత ఆస్పత్రులు పెట్టుకొని ప్రైవేటుకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతర కృషి



ఇబ్రహీంపట్నంలో ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు, విద్యార్థులు



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

ఘట్‌కేసర్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ వ్యవస్థ నిరంతరం శ్రమిస్తుందని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అన్నారు. సోమవారం ఘట్‌కేసర్‌లో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఘట్‌కేసర్ ఆర్టీసీ బస్ టెర్మినల్ నుంచి శివారెడ్డిగూడ వరక ర్యాలీని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల అదుపుకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. విధి నిర్వాహణలో అసువులు బాసిన అమరులను స్మరించుకునేందుకు ప్రతీ సవంత్సరం అక్టోబరు 21న పోలీసు అమరుల సంస్మరణదినంగా పాటిస్తున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

పట్నంలో ఫ్లాగ్ మార్చ్

ఇబ్రహీంపట్నం : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నంలో పోలీసులు, విద్యార్థులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ కేపీవీ రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరులను స్మరించుకోవడమేగాక వారి స్ఫూర్తితో కార్యక్రమాలు ముందుకు తీసుకుపోదామన్నారు. శాంతి భద్రతల విషయంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండిగో విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

ఆస్పత్రికి తరలింపు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ నుంచి అహ్మదాబాద్‌కు వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణికుడు అస్వస్థతకు గురికావడంతో అతన్ని ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి సోమవారం ఉదయం 11.15 గంటలకు ఇండిగో విమానం అహ్మదాబాద్ బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. అందులోని ప్రయాణికుడు మనోజ్‌కుమార్ సీట్ నంబర్ 13ఎఫ్ బోర్డింగ్ అయిన తరువాత అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన సిబ్బంది పైలెట్‌కు సమాచారం అందించడంతో అతడిని అక్కడే వదిలిపెట్టి విమానం అహ్మదాబాద్ బయల్దేరి వెళ్లింది. ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఎల్లో ఫీవర్ కార్డులేని మహిళ

» క్వారంటైన్‌కు ప్రయాణికురాలి తరలింపు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లో ఫీవర్ కార్డు లేని సూడాన్ దేశానికి చెందిన మహిళ ప్రయాణికురాలిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రిలో క్వారంటైన్‌కు తరలించారు. సూడాన్ దేశానికి చెందిన యాగీస్ ముస్తాఫా ఎల్హాక్ అనే మహిళ ప్రయాణికులు సోమవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఎయిర్‌పోర్టులో అధికారులు ఆమె పత్రాలు పరిశీలించగా ఎల్లో ఫీవర్ కార్డు లేని కారణంగా ఆమెను ఐదు రోజుల క్వారంటైన్‌కు ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. నిబంధనల ప్రకారం సుడాన్ దేశానికి చెందిన ఎవరైనా ఎల్లో వ్యాక్సినేషన్ వేసుకుని ఉంటేనే భారత్‌లోకి అనుమతిస్తారు. ఎల్లో ఫీవర్ కార్డులేని కారణంగా ఆమెను వైద్యాధికారులు క్వారంటైన్‌కు పంపించారు .



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ జగన్‌గౌడ్

అప్రమత్తతతోనే నష్ట నివారణ

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు డ్రైవర్, కండక్టర్ అప్రమత్తంగా వ్యవహరిస్తే ఆస్థి, ప్రాణ నష్టం ఏమాత్రం ఉండదని షాద్‌నగర్ ఫైర్ ఆఫీసర్ జగన్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్ బస్టాండ్‌లో సోమవారం డీఎం ఉషా ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జగన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఆర్టీసీ బస్సులో విధిగా అగ్ని ప్రమాద నియంత్రణ సిలిండర్, సుత్తి, అత్యవసర డోర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ నాగులు, సేఫ్టీ వార్డెన్ వెంకటయ్య, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయాన్ని తొలగించొద్దు

» ఎన్కతలలో అడ్డుకున్న గ్రామస్తులు .. పోలీసుల రంగ ప్రవేశం



మైసమ్మ ఆలయ పరిసరాల్లో రైతులు

మోమిన్‌పేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో మైసమ్మ ఆలయాన్ని తొలగిస్తామనడం సరైంది కాదని మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామానికి చెందిన రైతులు అన్నారు. టీజీఐఐసీ అధికారులు తొలగించేందుకు సిద్ధం కాగా సోమవారం రైతులు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామంలోని 198 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో అనాదిగా మైసమ్మ ఆలయం ఉందన్నారు. ఇక్కడ కొలువుదీరిన మైసమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి భూమిని రైతులకు కేటాయించడంతో దశాబ్దాలుగా గ్రామ రైతులు సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం భూమిని సేకరించి టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. అయితే పరిశ్రమల అభివృద్ధి కోసం పనులు చేపట్టారన్నారు. అందులో భాగంగా ఆలయాన్ని తొలగించేందుకు అధికారులు సిద్ధం కాగా ఆలయాన్ని తొలగించొద్దని అడ్డుకున్నారు. ఈ విషయంపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మోమిన్‌పేట్ ఎస్సై అరవింద్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అభివృద్ధిని అడ్డుకోవడం సరైంది కాదని, అదేవిధంగా ప్రజల మనోభావాలను అధికారులు గౌరవించాలన్నారు.

బీటీ రోడ్డు వేయాలి



ప్రజావాణిలో ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

యాలాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాలాల-లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వరకు కొత్తగా బీటీరోడ్డు వేయాలని కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ.. మండల కేంద్రానికి, దేవనూరు, గోరేపల్లి, కొత్తూరు వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారని, గుంతల రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం రోడ్డును మంజూరు చేసినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్పందించి వెంటనే కొత్త బీటీ రోడ్డు వేయించేలా చర్యలు చేపట్టాలని కోరారు.ఇదిలా ఉంటే ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణినిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ యలాల మండలంలో అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి హాజరు కావడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ గడ్డమీది బాలరాజ్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్ భవనం సీజ్



శ్రీచైతన్య స్కూల్ భవనాన్ని సీజ్ చేస్తున్న ఎంఈవో హీర్యానాయక్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ మంచాల రోడ్డులోని శ్రీ చైతన్య స్కూల్‌ను విద్యాధికారులు సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. పెట్రోల్ పంపును అనుసరించి ఈ స్కూల్ భవనం ఉండడంతో ప్రమాదకరంగా ఉందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారికి ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు డీఈవో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఎంఈవో హీర్యానాయక్ పాఠశాల భవనాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన భవనంలో ప్రీ ప్రైమరీ నుంచి ఏడో తరగతి వరకు క్లాసులు నడుస్తున్నాయి. ఇక్కడే పక్కన పాఠశాల మరో భవనంలో 8, 9, 10 తరగుతులు కొనసాగుతుండగా ఆ భవనంతో ఇబ్బందులు లేవని అధికారులు తెలిపారు.

ఎయిర్‌పోర్టులో బ్యాగు మాయం

» గంటల వ్యవధిలోనే కనిపెట్టిన పోలీసులు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బ్యాగు మాయమైన సంఘటన ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్ స్టేషన్‌లో జరిగింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం... నారాయణపేట జిల్లాకు చెందిన మున్నీరుద్దీన్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు వచ్చారు. ఎయిర్‌పోర్టులో బ్యాగు మాయమైంది. దీంతో ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తన సిబ్బందితో సీసీ ఫుటేజ్ పరిశీలించగా బ్యాగు దొరికింది. అందులో రూ.17 వేల నగదు, ల్యాప్‌టాప్, రెండు సెల్ ఫోన్లు, డెబిట్ కార్డు, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కార్డు ఐడీ కార్డు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు బాధితుడికి బ్యాగు అందజేశారు. సకాలంలో స్పందించిన పోలీసులు తన బ్యాగు అందజేయడంతో పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనల మేరకు ఇసుక వాడుకోవాలి

మాడ్గుల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇసుక వాడుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక పర్మిషన్ ఇవ్వాలని లబ్ధిదారులు ఎంపీడీవో విజయలక్ష్మిని కోరారు. దీనిపై సోమవారం స్థానికంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ట్రాక్టర్ యజమానులు మరొకరికి ఇసుక అమ్ముకొంటున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



సినీ నటికి ఆలయ చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి

శంకర్‌పల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని సినీ నటి స్వాతి అన్నారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని సోమవారం దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆమెను సన్మానించి ఆలయ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు సదానంద్‌గౌడ్, ప్రధానకార్యదర్శి జనార్దన్, కమిటీ సభ్యులు హనుమంతు తదితరులు ఉన్నారు. ఆలయ అర్చకుడు ప్రమోద్ ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యాదవ సంఘం నూతన కమిటీ

కొందుర్గు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ హక్కుల పోరాట కమిటీ కొందుర్గు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం అధ్యక్షుడు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడిగా మహేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా రవీందర్ యాదవ్, కార్యదర్శిగా రాజా శివకుమార్ యాదవ్, కోశాధికారిగా శ్రీనివాస్ యాదవ్, కార్యవర్గ సభ్యుడిగా యాదయ్య యాదవ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అశోక్ యాదవ్, నర్సింలు యాదవ్, వెంకటేశ్ యాదవ్, రాజు యాదవ్, రఘు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కే కదా అని వదిలేస్తే..

ప్రభుత్వ భవనాలకు పొంచి ఉన్న ముప్పు.. గోడలకు పగుళ్లు.. దెబ్బతింటున్న నిర్మాణాలు



కేశంపేట హైస్కూల్ తరగతి గది గోడ పై పెరుగుతున్న రావి మొక్క

కేశంపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భవనాలపై మొక్కలు పెరుగుతున్నాయి. వాటిని అలాగే వదిలేస్తే గోడలు కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. వివరాల్లోకి వెళ్తే.. కేశంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ తరగతి గదిపై రావి మొక్క మొలిచి ఎదుగుతుంది. గోడల నుంచి వేర్లు కిందకి వస్తున్నాయి. దీంతో గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇదే ఆవరణలో ఉన్న ఎమ్మార్సీ గోడలకు మొక్కలు మొలుస్తున్నాయి. గోడలకు పగుళ్లు వస్తున్నాయి. మొక్కలు చిన్నవిగా ఉన్నప్పుడే తీసివేస్తే గోడలు దెబ్బతినవు.

కేశంపేట ఎమ్మార్సీ గోడలపై మొక్కలు



అయితే చిన్న మొక్కే కదా..! అని వదిలేస్తే అదికాస్తా పెద్దదిగా పెరిగి గోడలు కూలిపోయే విధంగా మారుతుంది. ఎమ్మార్సీ భవనంపై చెత్త చెదారం నిండిపోవడంతో వర్షపు నీరు నిలిచి కలుపు పెరుగుతుంది. ఇలా గోడల్లోకి నీరు ఇంకి భవనం కూలిపోయే స్థితికి వస్తోంది. అధికారులు గుర్తించి గోడలపై పెరుగుతున్న మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



మహేశ్వరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మహేశ్వరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేష్ ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహేశ్వరంలో ఏబీవీపీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.8,100 కోట్ల రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణికి పేద, మధ్య తరగతి విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పై 15 లక్షల మంది విద్యార్థుల జీవితాలు ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లేని పక్షంలో భారీ ఆందోళనలకు దిగక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగిస్తే చర్యలు తప్పవు

తలకొండపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసగిస్తే ఎంతటి వారైన చర్యలు తప్పవని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాసమురుగన్ జిన్నింగ్ మిల్లులో సోమవారం సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మిల్లు నిర్వాహకుడు సంజీవ రెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులు విక్రయానికి తెచ్చిన పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలలో పత్తి విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్ కు రూ.8,110 మద్దతు ధర పొందాలని కోరారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్ పరిధిలో పత్తి కొనుగోళ్లకు మూడు మిల్లులను సీసీఐ గుర్తించిందని చెప్పారు.



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న యాట గీతానర్సింహ

కార్యక్రమంలో ఏవో రేణుకాచక్రవర్తి, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, కండె పాండురంగయ్య, అజీం, సంపత్, వస్పుల శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, యాదయ్యగౌడ్, తాళ్లరవీందర్, రమేశ్‌గౌడ్, నరేశ్‌నాయక్, నాయకులు యాదగిరి, పాండు, జహంగీర్‌అలీ, ఇమ్రాన్ బాబా, షాబొద్దీన్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో కేఎల్లార్

మహేశ్వరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పురాతన దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి శాశ్వత చైర్మన్‌గా రెడ్డిగళ్ల రత్నం కొనసాగుతుండగా నూతనంగా ఆరుగురితో కూడిన కమిటీ డైరెక్టర్లను దేవాదాయ శాఖ నియమించిందన్నారు. ఎల్లమ్మ ఆలయ కమిటి చైర్మన్‌గా రత్నం, డైరెక్టర్లుగా బాల్‌రాజ్, గోవర్ధన్‌రెడ్డి, అర్జున్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీలత, పల్లవి డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయానికి వచ్చి వెళ్లే ప్రధాన రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నదని, వెంటనే సంబంధిత అధికారులు సమన్వయంతో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, యాదయ్య, కృష్ణానాయక్, వెంకట్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

లక్కు చిక్కింది.. షాపు దక్కింది!

(ఐదో పేజీ తరువాయి)

తిరిగి నోటిఫికేషన్ ఇస్తామని ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. శంషాబాద్ జోన్ లక్కీడ్రా ప్రక్రియను ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, సరూర్‌నగర్ జోన్ ఉజ్వలరెడ్డి పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే ట్రాఫిక్ జామ్ కాకుండా సీఐ ప్రమోద్‌కుమార్ జాగ్రతలు తీసుకున్నారు. శంషాబాద్ జోన్‌లో 108 మద్యం దుకాణాల్లో మణికొండకు చెందిన ఓ మహిళ మాత్రమే లక్కీ డ్రా గెల్చుకుంది. శంషాబాద్ జోన్ వేలంలో స్థానికంగా ఉండే భరత్ అనే విద్యార్థి మొదటిసారి యాక్షన్‌లో పాల్గొన్నగా అతనికి 16వ షాప్ దక్కింది. దీంతో అతడు మీసాలు మెలేసి తోడ కొట్టాడు. పాల్గొన్న మొదటి సారి మద్యం దుకాణం దక్కడం సంతోషంగా ఉందని చెప్పారు.

లక్కీడ్రాలో మాజీ ఎంపీటీసీకి దుకాణం



గూడూరు శ్రీనివాస్ రెడ్డికి దుకాణ కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఉజ్వల రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలకు నిర్వహించిన లక్కీ డ్రాలో కడ్తాల 103వ దుకాణానికి 60 మంది దరఖాస్తులు చేసుకోగా స్థానిక మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డిని అదృష్టం వరించింది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉజ్వల రెడ్డి దుకాణం దక్కించుకున్న శ్రీనివాస్‌రెడ్డికి కేటాయింపు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, టెండరు దారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లతో రూ.30.27 కోట్ల ఆదాయం

మహేశ్వరం: మహేశ్వరం ఎక్సైజ్ పరిధిలో మొత్తం 14 మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ ద్వారా ఈ ఏడాది ప్రభుత్వానికి రూ.30.27 కోట్ల ఆదాయం లభించిందని మహేశ్వరం ఎక్సైజ్ సీఐ తిరుపతి రెడ్డి తెలిపారు. మహేశ్వరం ఎక్సైజ్ పరిధి కందుకూరు, మహేశ్వరం, తుక్కుగూడ మున్సిపాలిటీలో మొత్తం 14 మద్యం దుకాణాలకుగాను 109 దరఖాస్తులు రాగా వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.30.27 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు.

చెరువుల సంరక్షణకు సత్వర చర్యలు

మంచాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): చెరువుల సంరక్షణకు సత్వర చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఏఈ శ్రీవాణి పేర్కొన్నారు. ఇటీవలి వర్షాలకు చెరువు కట్టకు పగుళ్లు ఏర్పడిన ఆరుట్ల ముద్దిరెడ్డి చెరువును సోమవారం సందర్శించారు. ముద్దిరెడ్డి చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు అలుగు పారుతోందని, కట్ట మధ్యభాగంలో సీసీ పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారిందంటూ స్థానిక నేత కె.భాస్కర్ నీటి పారుదల శాఖ అధికారులకు వివరించారు. దీనిపై ఏఈ శ్రీవాణి మాట్లాడుతూ చెరువు కట్టకు మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో బాలశంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీలో చెరువు కట్టకు ఇరువైపులా ఈత చెట్లు నాటేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు దామెర భూపాల్, చిందం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



ఆరుట్ల ముద్దిరెడ్డి చెరువును పరిశీలిస్తున్న ఏఈ శ్రీవాణి, తదితరులు

కేసీఆర్ మరోసారి సీఎంగా రావాల్సిన అవసరముంది

(ఐదో పేజీ తరువాయి)

ఆ మాట తీయరన్నారు. బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్‌గాంధీ విమర్శించారు. కానీ తెలంగాణలో అదే హైడ్రా ద్వారా అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే ఆయన ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని, మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగండి వారు సమాధానం చెప్పలేరన్నారు. సీఎం అవుతానని రేవంత్‌రెడ్డి అనుకోలేదన్నారు. మోదీ స్కూల్‌లో చదివాను... చంద్రబాబు కాలేజీకి వెళ్లాను.. రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్‌రెడ్డి బహిరంగగానే చెబుతున్నారన్నారు. చౌకీదార్ చోర్ అని రాహుల్ గాంధీ అంటే.. కాదు కాదు ఆయన నా పెద్దన్న అని రేవంత్ చెబుతారన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు సంస్థలని విమర్శిస్తే... రేవంత్ మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టు కేసును సీబీఐకి అప్పగించారన్నారు. సంవత్సరం క్రితం రెండు రోజుల పాటు పొంగులేటి ఇంటిపై రైడ్స్ అయ్యాయని, ఆ తర్వాత అంతా సైలెంట్ అయ్యారన్నారు. రేవంత్‌రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాయని, దానికి బదులుగా ఆయన బీజేపీ నేతకు లాభాలు చేకూరుస్తారన్నారు. మోదీ తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తెలంగాణలో రేవంత్ అమలు చేస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ప్రభుత్వం నడిపిస్తున్నాయని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. మైనార్టీలంతా కలసి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ హోం మంత్రి మహమూద్‌అలీ, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, మోహన్‌రావు, హనుమంత్, అబ్దుల్‌ముఖిద్‌చందా పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

కడ్తాల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం పొందవచ్చునని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ చైర్‌పర్సన్ గీత అన్నారు. సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు దోహద పడుతాయన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సోమవారం సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామావత్ భాస్కర్, తహసీల్దార్ జ్యోతి మైసిగండి మైసమ్మ దేవాలయ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపాతి అమరేశ్‌రెడ్డి, ఆలయ అర్చకులు, పలువురు నాయకులు ఉన్నారు.



పూజలు చేస్తున్న శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

కందుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రత పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని కందుకూరు సీఐ సీతారాం అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో సైకిల్ తొక్కి పోలీసు అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అమరవీరుల కుటుంబాలు అన్ని రంగాల్లో రాణించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పోలీసులు ఛేదిస్తున్న ప్రతి క్రైం కేసు ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని తెలిపారు.



కందుకూరులో సిబ్బందితో కలిసి సైకిల్ తొక్కుతున్న సీఐ సీతారాం

ఆరోగ్యంతోనే అనుకున్నది సాధిస్తాం

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంతోనే అనుకున్నది సాధిస్తామని షాద్‌నగర్ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే అన్నారు. కూకట్‌పల్లి ఇస్కాన్, తెలంగాణ ఉన్నత విద్యామండలి సంయుక్తంగా కళాశాలలో సోమవారం మహిళల్లో వస్తున్న క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 17 మంది విద్యార్థినులు ప్రసంగం ఇచ్చారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా అప్రమత్తంగా ఉంటే క్యాన్సర్‌తోపాటు ఇతర జబ్బులు కూడా పేర్కొన్నారు. అధ్యాపకులు డాక్టర్ కళాజ్యోతి, డాక్టర్ శ్రీలత, రాజేశ్వరి, ముంతాజ్, పరమేశ్వరి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

షాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో అంకుగూడ, ఉబ్బగుంట గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధి సోకడం వల్ల పశువుల్లో మరణాల శాతం తక్కువ ఉన్నా ఉత్పాదక శక్తి, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మాలల రణభేరిని విజయవంతం చేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న మాల మహానాడు నాయకులు

కేశంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లో నిర్వహించే మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని షాద్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోరేటి కుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వేముల నర్వ గ్రామంలో సోమవారం రణభేరి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలలు తమ హక్కుల సాధనకై ఉద్యమించాలని సూచించారు. నవంబర్ 23న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో పెద్ద ఎత్తున్న మాలల రణభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో మాలలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బ్యాగరి రమేష్, ఉపాధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి నాగేటి యాదయ్య, భూపాల్, చెన్నయ్య, బట్టు నవీన్, ప్రకాశ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, కారు

తృటిలో తప్పిన ప్రమాదం

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై సోమవారం ఉదయం ఓ కారు, బస్సు ప్రమాదానికి గురయ్యాయి. ఈ ఘటనలో ఎవరూ గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. క్విడ్ కారులో నల్లగొండ జిల్లా మర్రిగూడ ఎంపీవోగా ఉన్న రవికుమార్ హైదరాబాద్ నుంచి మర్రిగూడ వెళ్తున్నారు. చిన్న చెరువు కట్టపై ముందుగా వెళ్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయి కారు డివైడర్ పైకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. అదే సమయంలో వెనకాలే వస్తున్న ఇబ్రహీంపట్నం డిపోనకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు ప్రమాదానికి గురైన కారును తప్పించబోయి డివైడర్ ఎక్కింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కారు యజమాని, బస్సు డ్రైవర్ వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద రోడ్డులో సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. శేరిగూడ వైపు నడుచుకుంటూ వస్తున్న గుర్తు తెలియని మహిళ (40)ను వెనకాల నుంచి వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనంలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. పోలీసులు ఆమెను ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీలో చేర్పి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం



ఫాతిమా(ఫైల్)

శంషాబాద్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలంలోని చౌదర్‌గూడ గ్రామానికి చెందిన తస్వీర్ ఫాతిమా పాలు తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. చాలా సేపటివరకు తిరిగి రాకపోవడంతో ఆమె సోదరుడు మొహ్మద్ నిజామ్ చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికాడు. సీసీ కెమెరాను తనిఖీ చేయగా ఆటోలో బయలుదేరినట్లు గుర్తించాడు. తన సోదరి అదృశ్యం వెనక బహదూరపురకు చెందిన మొహ్మద్ ముస్తాఫపై అనుమానం ఉందని సోమవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కూలికి వెళ్లిన వ్యక్తి..



విఠల్(ఫైల్)

శంకర్‌పల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కూలికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శంకర్‌పల్లి పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంబాడి విఠల్(35) తన కుటుంబంతో కలిసి మహాలింగపురంలోని అంజిరెడ్డి గార్డెన్ ఎదురుగా నివాసముంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం శంకర్‌పల్లికి వచ్చాడు. కూలి పని కోసం వెళ్లిన భర్త విఠల్ ఇంటికి తిరిగిరాకపోవడంతో భార్య సునీత తెలిసిన వారి వద్ద వెతికింది. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం శంకర్‌పల్లి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.



చెక్కులు అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ మేకల ప్రభుసాగర్

సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలను సకాలంలో చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని శంషాబాద్ మండలంలోని మల్కారం సహకార సంఘం పీఏసీఎస్ చైర్మన్ మేకల ప్రభుసాగర్ అన్నారు. సోమవారం పలువురు రైతులకు దీర్ఘకాలిక, పంట రుణం చెక్కులు పంపిణీ చేశారు. సహకార సంఘంలో నూతనంగా పది మంది రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.73,75,000, పంట రుణం 38 మంది రైతులకు రూ.20,00,000 కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పిండి లక్ష్మి, కృష్ణారెడ్డి, మూడవత్ రెడ్యా, ఎండీ.వాజీద్‌ఖాన్, కార్యదర్శి సురేందర్, నీరటి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ జయశ్రీకి ఘన సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జయశ్రీని సోమవారం ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జయశ్రీని పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. పైరవీలకు తావులేకుండా రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు జహంగీర్‌అలీ, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌బాబా, బీసీ సెల్ అధ్యక్షుడు పిప్పళ్ల యాదయ్య, నాయకుడు రాజేందర్ గౌడ్ ఉన్నారు.

హామీల అమలుతో ప్రజలకు చేరువయ్యాం



ఎన్నికల ప్రచారంలో శ్రీనివాస్‌గౌడ్, మంజ్లీ రాములు

ఆమనగల్లు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హామీల అమలుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువైందని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మంజ్లీ రాములు అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో భాగంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కేటాయించిన ఆరు పోలింగ్ బూత్‌ల పరిధిలో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన బీఆర్ఎస్ ఉనికి కోసం కుట్ర రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వస్పుల శ్రీకాంత్, జవహర్‌లాల్‌నాయక్, తులసీరామ్ నాయక్, పరీద్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, అంజి ఉన్నారు.